క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు నడిపించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భీమారం: మంచిర్యాల నుంచి భీమారం, కొత్తపల్లి మీదుగా చెన్నూర్ మండలం అంగరాజ్ పల్లి వరకు ఆర్టీసీ బస్సు ప్రారంభించాలని మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. భీమారం నుంచి ఆరెపల్లి మద్దికల్ కొత్తపల్లి వరకు బీటీ రోడ్డు ఉన్నా, ప్రజారవాణా సదుపాయం లేదని వారు ఎమ్మెల్యేకు వివరించారు. మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి మోహన్ రెడ్డి, నాయకులు ఆనమోల్ల అశోక్, గద్దె రాంరెడ్డి, చిలకాని కనకయ్య పాల్గొన్నారు.

బెల్లంపల్లి డివిజన్‌లో 3,753మంది ఓటర్ల నమోదు

బెల్లంపల్లిరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌లో 3753మంది ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఆర్డీవో పి.హరికృష్ణ తెలిపారు. నేటితో ఓటరు నమోదు గడువు ముగుస్తుందని, ఓటరుగా నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులు తమ వివరాలను వెంటనే నమోదు చేసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. నవంబర్ 1వ తేదీ కంటే ముందే గుర్తింపు పొందిన యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు


తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

మంచిర్యాలటౌన్: మార్కెట్ రోడ్డును ఆక్రమించి కట్టిన కట్టడాల కూల్చివేతలు మంగళవారం మున్సిపల్ అ ధికారులు కొనసాగించారు. కొంతకాలంగా మున్సిపల్ అధికారులు ఆక్రమణలను తొలగిస్తుండగా, కొందరు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తొలగించుకుంటామని గడువును కోరగా, గడువు తీరినా తొలగించని ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు.

కోర్టు భవనం కోసం దీక్ష


దీక్ష చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో కోర్టు భవన నిర్మించాలని, స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్ స్థానిక ఐబీ చౌరస్తాలోని హనుమాన్ విగ్రహం వద్ద మంగళవారం మౌన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముందు ఆయన మాట్లాడుతూ జిల్లాలో కోర్టు స్వంత భవనం లేక న్యాయవాదులు, కక్షిదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వాహనాలను రోడ్డుపై పార్క్ చేయాల్సి వస్తోందన్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తున్నారని పేర్కొన్నారు. కోర్టు భవనానికి స్థలం కేటాయించినందున భవనం నిర్మించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కోర్టు భవన నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చి, కోర్టు భవన నిర్మాణానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జగన్ చేపట్టిన మౌన దీక్షకు న్యాయవాదులు గోలి శ్రీనివాస్, రవికుమార్, భీమయ్య, కొట్టె నటేశ్వర్, పలువురు న్యాయవాదులు మద్దతు తెలిపారు.

108లో ప్రసవం

కాసిపేట: బెల్లంపల్లి మండలం లింగపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ భార్య భూలక్ష్మికి సోమవారం అర్ధరాత్రి నొప్పులు అధికమయ్యాయి. 108అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సుఖప్రసవం అయినట్లు ఈఎన్‌టీ ఆత్మారావు తెలిపారు. మూడో కాన్పులో ఆడపాపకు జన్మనిచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు, తల్లీబిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు వివరించారు.

కాసిపేట గుట్టల్లో పెద్దపులి?

- ఆవులపై పెద్దపులి, చిరుతల దాడి

కాసిపేట: మండలంలోని అడవుల్లో చిరుత పులులతో పాటు పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలుపుతున్నారు. గోండుగూడ రైతు ఆత్రం చిత్రుకు చెందిన మూడు ఆవులపై దాడిచేయగా పెద్దపులి సంచారం బయటపడింది. అటవీ శాఖ అధికారుల సమాచారం ప్రకారం.. మండలంలోని ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలోని గురువాపూర్ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం, ట్రెంచ్‌ల సమీపంలో పెద్దపులి, చిరుత పులుల పాదముద్రలు ఉన్నాయి. కిలోమీటర్ దూరంలో మేడారం అటవీ సెక్షన్ పరిధిలో ఆవులపై దాడులు జరగడంతో లక్సెట్టిపేట రేంజ్ అటవీశాఖ అధికారులు నిర్ధారణ చేసి సీసీ కెమెరాలు అమర్చారు. పెద్దపులి పాదముద్రలకు వ్యతిరేక దిశలో చిరుత పాదముద్రలు, మరోచోట పెద్దపులి పాదముద్రలపై చిరుత పాదముద్రలు ఉండటంతో ఒకేచోట రెండు చిరుతలు ఉన్నాయా అనే అనుమానం ఉంది. కవ్వాల్‌కు చెందిన పెద్దపులి మండలంలో సంచరించి మంగళవారం రోజు వరకు పాత మంచిర్యాల సమీప ప్రాంతంలోకి చేరినట్లు సమాచారం. చెక్‌డ్యాంలతో పాటు నీటి వనరులు వన్యప్రాణుల సంచారానికి అనుకూలంగా మారాయి. ఈ విషయమై డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్‌ను 'సాక్షి' వివరాలు అడగ్గా బుధవారం ఫీల్డ్ విజిట్ చేసి సీసీ కెమెరాల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

మృతిచెందిన ఆవులకు 24 గంటల్లో పరిహారం


బాధిత రైతుకు పరిహారం అందిస్తున్న అధికారులు

కాసిపేట: మండలంలోని గోండుగూడంకు చెందిన ఆత్రం చిత్రు మూడు ఆవులు పెద్దపులి దాడిలో మృతిచెందగా సంఘటన జరిగిన 24గంటల్లో అటవీశాఖ అధికారులు నష్టపరిహారం చెక్కు అందజేశారు. ముత్యంపల్లి డెప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్ కథనం ప్రకారం.. ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని గోండుగూడకు చెందిన రైతు చిత్రు మూడు ఆవులు ఆదివారం సాయంత్రం లక్సెట్టిపేట రేంజ్‌లోని మేడారం సెక్షన్ పరిధిలో మేతకు వెళ్లగా పెద్దపులి, చిరుతలు దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో మూడు ఆవులు మృతిచెందగా విషయం తెలుసుకున్న లక్సెట్టిపేట ఎఫ్‌ఆర్‌వో సుభాష్‌తో కలిసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. పశువైద్యాధికారి తిరుపతి ద్వారా పంచనామా నిర్వహించి వాటి విలువ రూ.30వేలుగా నిర్ణయించగా ఎఫ్‌డీవో, డీఎఫ్‌వో, ఎఫ్‌డీపీటీ కవ్వాల్ సూచన మేరకు బాధిత రైతుకు రూ.33వేల పరిహారం చెక్కును అందజేసినట్లు తెలిపారు. అటవీప్రాంతంలో చిరుతపులి, పులులకు హాని కలగకుండా చూడాలని కోరారు. వన్యప్రాణులను వేటాడకూడదని హెచ్చరించారు. అటవిప్రాంతంలోకి మనుషులు ఎవరు వెళ్లవద్దని, పులికి సంభందించి సమాచారం తెలిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మేడారం ఎఫ్ఎస్‌వో అహ్మద్ అలీ, ఎఫ్‌బీవో శ్రీనివాస్ తదితరులున్నారు.

రైతు లేకుంటే ప్రపంచమే ఆగిపోతుంది

- జిల్లా లీగల్‌సర్వీస్ అథారిటీ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి


జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతు లేకుంటే ప్రపంచమే ఆగిపోతుందని జిల్లా లీగల్‌సర్వీస్ అథారిటీ కార్యదర్శి(డీఎల్ఎస్ఏ) అర్పిత మారంరెడ్డి అన్నారు. హాజీపూర్ మండలం గుడిపేట రైతువేదికలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. ఆరోగ్యకర జీవనం సాగించాలన్నారు. రైతులు భూ సమస్యలపై ఫిర్యాదు చేయాలంటే టోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి కల్పన మాట్లాడుతూ, రైతులు, నాణ్యమైన విత్తనాలు ఎంచుకుని పంటసాగు చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలను వాడొద్దని తెలిపారు. సదస్సులో భాగంగా జాతీయ రాహదారి 63లో వ్యవసాయ భూములు కోల్పోతున్న పలువురు రైతులు జడ్జి ఎదుట పలు అనుమానాలు వ్యక్తం చేయగా, సానుకూలమైన సమాధానాలు ఇవ్వడంతోపాటు తగిన సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ సురేఖ, తహశీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, ఏవో కృష్ణ, లీగలైడ్ డిఫెన్స్ సభ్యులు ఆర్.రాములు, ఎండీ.సందాని, సేంద్రీయ సాగు రైతులు గోనె శ్యాంసుందర్‌రావు, పూస్కూరు శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, ఎరువుల దుకాణాల యజమానులు, ఏఈఓలు పాల్గొన్నారు.

దేవాపూర్ అటవీ రేంజ్‌ను బెల్లంపల్లిలో కలపాలి


అటవీ శాఖ కన్జర్వేటర్ శాంతారాం కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని దేవాపూర్ అటవీ రేంజ్‌ను బెల్లంపల్లి డివిజన్‌లో విలీనం చేయాలని ఎంసీపీఐ(యూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ శాఖ కన్జర్వేటర్ శాంతారామ్, అటవీ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ మల్లయ్యకు మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గంలో ఉండే దేవాపూర్ రేంజ్‌ను ఆసిఫాబాద్‌లో చేర్చడం సరికాదన్నారు. దేవాపూర్ రేంజ్‌ను బెల్లంపల్లి డివిజన్‌లో విలీనం చేసి బెల్లంపల్లికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లాలో రోడ్లకు ఇరువైపులా, డివైడర్ల మధ్యలో ఉన్న కానోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాన్నారు. బెల్లంపల్లి అటవీ డివిజన్ ఎత్తివేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

మంచిర్యాలఅగ్రికల్చర్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ అనుబంధ మధ్యాహ్నభోజన కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్, జిల్లా విద్యా శాఖ కార్యాలయం సూపరింటిండెంట్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్య క్ష, కార్యదర్శులు దాసరి రాజేశ్వరి, ఎండీ.రఫియా మాట్లాడుతూ 8 నెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు, 9, 10 తరగతి భోజన బిల్లులు చెల్లించాలన్నారు. మెనూ చార్జీలు పెంచాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల్లో ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సూచించారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళ ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్ల గడువు పొడగింపు

మంచిర్యాలఅర్బన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఓపెన్ డిగ్రీ పూర్తి చేయాలనుకునే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేద్కర్ స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి అన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 15వరకు గడువు పొడిగించినట్లు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

ఓటరు నమోదుకు నేడే ఆఖరు

తాండూర్: పట్టభద్రుల ఓటు నమోదు బుధవారం చివరి తేదీ అని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియ గడువు ముగిసేలోగా అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకొని ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


హమాలీవాడ పోచమ్మ చెరువు వద్ద నాగదేవత ఆలయంలో..


చెన్నూర్ శివాలయంలోని పుట్టలో పాలుపోస్తున్న భక్తులు


గర్మిళ్ల ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద భక్తుల మొక్కులు

మంచిర్యాలఅర్బన్/చెన్నూర్: జిల్లా కేంద్రమైన మంచిర్యాలలో నాగుల చవితి పర్వదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. నాగదేవతకు ప్రతీకగా భావించే పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. నాగదేవతకు ప్రీతికరమైన పాలు, నువ్వుల పిండి, కోడిగుడ్లు నైవేద్యంగా అర్పించారు. గౌతమినగర్ చౌరస్తా, హమాలీవాడ పోచమ్మ కట్ట వద్ద నాగదేవత ఆలయం,గర్మిళ్ల హనుమాన్ ఆలయంతో పాటు పలు నాగుల పుట్ట వద్ద భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు చేశారు. చెన్నూర్ పట్టణంలో నాగుల చవితి వేడుకలను పట్టణ ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక శివాలయంలో గల పుట్టలో నాగదేవతకు పాలు పోసి పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు వేమారం మహేశ్వర్‌శర్మ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్ (రాజన్నలవాడ)ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజ్‌కుమార్, ఎస్సై ఇన్‌స్పెక్టర్ లచ్చన్న కథనం ప్రకారం.. విద్యానగర్ నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయనే నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేయగా 7క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. రేషన్ బియ్యంతో పాటు వాహనం, రాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్థానిక విచారించి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

నేర నియంత్రణలో అప్రమత్తంగా ఉండాలి


పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ రవికుమార్

తాండూర్: సమాజంలో జరుగుతున్న నేరాలను నియంత్రించడంలో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. మండలంలోని తాండూర్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి కార్యకలాపాలను శాశ్వతంగా అరికట్టాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా వారిని చైతన్యపరిచేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధాన కూడళ్లల్లో, గృహాల వద్ద ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు చొరవ తీసుకోవాలన్నారు. సిబ్బంది కొరత వల్ల శాంతిభద్రతల పరిరక్షణలో కొంత ఇబ్బంది తలెత్తుతోందని, నూతనంగా నియామకమైన సిబ్బందితో ఆ కొరత లేకుండా చూస్తామన్నారు. ఏసీపీ వెంట తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్సై కిరణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

బెల్లంపల్లిరూరల్: మందమర్రి పట్టణంలో ఈ నెల 8, 9వ తేదీల్లో నిర్వహించే సీపీఎం పార్టీ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం పార్టీ బెల్లంపల్లి ఏరియా కార్యదర్శి గోమాస అశోక్ అన్నారు. సీపీఎం పార్టీ పట్టణ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎం పార్టీ మహాసభలకు సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్యతో పాటు ఇతర ప్రతినిధులు హాజరవుతారన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక పాలనను మానుకోవాలని, సింగరేణి బొగ్గుబ్లాక్‌ల వేలంను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీ నిరంతర పోరాటాలు సాగిస్తుందని తెలిపారు. మహాసభలకు పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం పార్టీ నాయకులు రమణ, దేవదాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

బదిలీపై వెళ్తున్న మేనేజర్‌కు వీడ్కోలు


అబ్దుల్‌ఖాధీర్‌ను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఆర్కేప్ గని మేనేజర్‌గా పని చేసి పదోన్నతిపై మందమర్రికి బదిలీపై వెళ్తున్న అబ్దుల్‌ఖాదీర్‌ను ఏరియా అధికారులు మంగళవారం సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం మురళీధర్, డీజీఎంలు చిరంజీవులు, ఆనంద్‌కుమార్, మల్లయ్య, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, వీటీసీ మేనేజర్ రామారావు పాల్గొన్నారు.

ఘనంగా వీటీ అబ్రహం వర్ధంతి


శాంతిఖని గనిపై నివాళులర్పిస్తున్న కార్మికులు

బెల్లంపల్లిరూరల్: అమరజీవి, ఏఐటీయూసీ నేత వీటీ అబ్రహం వర్ధంతి వేడుకలు మంగళవారం శాంతిఖని గనిపై కార్మికులు ఘనంగా నిర్వహించారు. శాంతిఖని గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అబ్రహం చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించి నివాళులర్పించారు. ఆయన కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. అబ్రహం చూపిన పోరాట బాట అనుసరనీయమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మంతెన రమేష్, మిట్టపల్లి రమేష్, రాజలింగం, సంతోష్, భాస్కర్, శ్రీకాంత్, గణేష్, రవి కుమార్, శ్రావణ్, రవి, రాంచందర్, దుర్గయ్య, ఉపేందర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు టీబీజీకేఎస్ సన్మానం


జీఎంను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ నూతన జీఎం ఎల్వీ సూర్యనారాయణను మంగళవారం టీబీజీకేఎస్ నేతలు యూనియన్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు. అనంతరం ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్‌గా పని చేసి పదోన్నతిపై బదిలీపై వెళ్తున్న రాయుడును, నూతన సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డిలను కూడా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కురుమ వికాస్, ఉత్తేజ్‌రెడ్డి, రమణారెడ్డిలు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంప్రదింపుల కమిటీ ఏర్పాటు

శ్రీరాంపూర్: త్వరలో జరగబోయే సింగరేణి బీసీ ఉద్యోగుల మహాసభ నిర్వహణ కోసం సంప్రదింపుల కమిటీని ఎన్నుకున్నట్లు సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పేరం రమేశ్ తెలిపారు. జీఎం కార్యాలయంలో ఆవరణలో మంగళవారం బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకుల సమావేశం జరిగింది. ఇందులో కమిటీ సభ్యులుగా ఎస్వీ రాజేశ్వర్‌రావు, మోతూకూరి కొమురయ్య, బరుపటి మారుతి, గొర్ల సంతోశ్, ఎస్ శ్రీనివాస్, నామల శ్రీనివాస్‌లను నియమించారు. సమావేశంలో నాయకులు బీసీ నాయకులు ముస్కె సమ్మయ్య, పెట్టం లక్ష్మణ్, వంగల కుమారస్వామి, రమేశ్, నరేశ్, లచ్చన్న, రాంచందర్, సుధాకర్, బుచ్చయ్య, వికాస్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్టిస్ట్ పోచంకు సన్మానం
చెన్నూర్: కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కళాయాత్ర నిర్వహించిన ఎల్పుల పోచంను స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కేపీఎం ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

జిజ్ఞాస సంచార ప్రయోగశాల
చెన్నూర్‌రూరల్: విద్యార్థులలో వినూత్న ఆలోచనలు పెంపొందించేందుకు గాను జిల్లా సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పొక్కూరు గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన పలు ప్రయోగాలను చేసి చూపించారు. మానవ శరీరానికి సంబంధించిన ప్రయోగాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు
చెన్నూర్: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై సుబ్బారావు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.

నియామకం
బెల్లంపల్లిరూరల్: బ్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా మంగళవారం బెల్లంపల్లికి చెందిన బందెల మురళి ఎన్నికయ్యారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి
తాండూర్: సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ సూచించారు. ఎన్యుమరేటర్లకు మంగళవారం అవగాహన కల్పించారు.

దుప్పట్లు, స్టేషనరీ పంపిణీ
జన్నారం: మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్ విద్యార్థులు చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి సూచన ప్రకారం మంగళవారం గిరిజన నిరుపేద విద్యార్థులకు దుప్పట్లు, స్టేషనరీ అందజేసి ఔదార్యం చాటారు.

రాష్ట్ర సలహాదారుడిగా బాపూజీ
వేమనపల్లి: రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర సలహాదారుడిగా వేమనపల్లి మండలం కేతన్‌పల్లికి చెందిన బాపూజీ ఎన్నికయ్యారు.

కమిటీ ఎన్నిక
కోటపల్లి: ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి సంపత్ ఆధ్వర్యంలో మంగళవారం నక్కలపల్లి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు
భీమిని: కన్నెపల్లి మండలంలోని టీకులపల్లి గ్రామ పంచాయతీలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.